# అన్నమాంబ విశ్వదాంపత్యోపనిషత్తు

## కొమ్మనదండనాథుని దశాహస్సు*

= శ్రీ పున్నవ లక్ష్మీనారాయణ =

**పాత్రలు**

కొమ్మనదండనాథుడు—తిక్కనతండ్రి; నెల్లూరి ప్రభువగు మనుమసిద్ధిపాలనలో గుంటూరికి దండనాథుడు; మహాపండితుడు; అధ్యయనపరుడు; వీరుడు; సారంగునితో మనుమసిద్ధికి ఒంగోలులో జరిగిన యుద్ధములో సేనాపతిగా ఉండి విజయమును గాంచి వీరమరణమును బొందినాడు.

అన్నమాంబ—కొమ్మనదండనాథుని భార్య; తిక్కనతల్లి.

సీతమ్మ—తిక్కనభార్య.

దోహత్తనారాయణ—ఖడ్గతిక్కన తమ్ముడు; కొమ్మన శిష్యుడు.

అన్నయమంత్రి—వరంగల్లునుంచి వచ్చిన రాయబారి.

ఆ వేళ పదోరోజు. బంధువులంతా అన్నమాంబమొగం చూడడంకోసము వస్తున్నారు. సీతమ్మ కాపురానికి వచ్చిన కొత్తలో అన్నమాంబకు పెండ్లీడువచ్చిన ఒక్క ఆడపిల్లా పోయింది. సీతమ్మ "అత్తయ్యా - అత్తయ్యా" అంటూ తలలో నాలుకలాగు వదలకుండా వెంటదిరుగుతూ పుత్రికాశోకాన్ని మఱపించింది. చూచినవాండ్లు తల్లీ, బిడ్డా అనుకుంటారుగాని అత్తా, కోడలూ అని అనుకోరు. తిక్కనకు నెల్లూరిలో ఉద్యోగమయిన కొత్తలో తల్లిని వదిలి అత్తవారింటికి పోయినట్టుగా గుంటూరునుంచి నెల్లూరు పోయింది. సంవత్సరానికి ఒక మాటయినా తల్లిని చూడడానికి పోకపోయినా మర్లుబుట్టినట్లు అత్తా, కోడలూ ఒకరినొకరు చూచుకోకుండా ఉండలేకపోయేవారు. సీతమ్మతల్లి "నా బిడ్డకు మందుపెట్టి నాకు గాకుండా చేసిం"దని వియ్యపురాలిని హాస్యమాడేది. ఈసారి వచ్చినప్పటినుంచీ అత్తను నిమిషము వదిలిపెట్టకుండా పక్కలోనే, మీద చేయివేసుకొని పడుకొనేది. ఈరోజు వుదయంనుంచీ పక్కన కూర్చొని, మొగమువంక చూస్తూ, ఏకధారగా కండ్లనీరు గారుస్తూ కూర్చున్నది.

అన్నమాంబ—అదేమిటే పిచ్చిపిల్లా! ఒక్క మోయిన కండ్లనీళ్లు పెట్టుకుంటూ కూర్చుంటావు. కండ్లకు అవరోధము గాదూ?

"నీ పునిస్త్రీమొగము ఈ జన్మానికి ఇక మళ్లీ చూడనుగా అత్తయ్యా" అని సీతమ్మ పెద్ద పెట్టున ఏడ్చింది.

అంతలోకే తిక్కనా, దోహత్తనారాయణా గదిలోకివచ్చారు.

అన్నమాంబ—నాయనా వచ్చావుటరా దోహత్తా! వీడు అందరికంటె రెట్టింపుపాఠాలు తీసుకొని ఎక్కడా నట్లుపోకుండా వొప్పజెప్పుతూంటే మురుసుకొనేవారు. అధ్యయనపు రోజుల్లో గూడా ఏవోపాఠా లిస్తుంటే 'విశ్రాంతిలేకపోతే వాడికి జబ్బు చేయదా' అని నేనంటే 'వాడికేమీ జబ్బుచేయదు. అట్లా అనబోకు. నిజంగా జబ్బు చేస్తుంది' అనేవారు. పాఠాలు చెప్పడమంటే అలుపు ఎన్నడూ లేదు. ఇక్కడికి యాభైయేండ్లనుంచి విధీ విరామం లేకుండా ఒక్క తీరాన పాఠాలు చెప్పిన నోరు మూతబడ్డది. ఆ చదువుకొన్న చదువంతా ఏమట్టిపాలయిందో?

కడపటిమాట తిక్కనకు శూలమైతాకింది. దోహత్త తిక్కన మొగం చూచాడు. తండ్రి మరణమువలన సృష్టివిధానమును గూర్చిన ఆయనవిశ్వాసము లెన్నిటిలో పాదుకదిలిందని ఎరుగడు.

---

* ఇది 'తిక్కన' అను పేర శ్రీ పున్నవ లక్ష్మీనారాయణగారు వ్రాసియుండు నవలలో ౫, ౬ అధ్యాయముల గ్రంథము.

తిక్కన—ఒరే నారాయణా! మతసిద్ధాంతములను గూర్చి నాన్నగారు తరచుగా వెల్లడిచేస్తూవచ్చిన అభిప్రాయాలు కొన్ని నాకు క్రొత్తగా కనుపడేవి. మీ రిద్దరూ ఏకీభవిస్తుండేవాండ్లు. ఈపది రోజులలో నా అభిప్రాయాలలో నా తలవెంట్రుకలన్ని మార్పులు వచ్చినవి. ఏదో సందేహం కలగడం, నివర్తికావడం దానంతట అదే అవుతున్నది.

దోహర్త—శుద్ధసత్వబుద్ధులకు సందేహాలు భగవంతుడే కలిగిస్తాడు. సమాధానాలూ ఆయనే చెపుతాడు.

తిక్కన—ఇదివర కిట్లా సమాధానాలు రావడంలేదు.

దోహర్త—భగవంతు డీమధ్యనే మీకు సత్యబుద్ధి ప్రసాదించి వుంటాడు.

తిక్కన—ప్రత్యేక పరిస్థితు లేమి వచ్చినవి?

దోహర్త—నిన్న మన దొడ్లో మామిడి యీయేడు పూతకు వస్తుందిరా అంటిరే. మామిడి పూతకువస్తుంది. కోడి కూతకువస్తుంది. లేడి యీతకు వస్తుంది.

తిక్కన—కాలము. పక్వంచేస్తుంది.

దోహర్త—భగవానుడు పక్వంచేస్తాడు.

తిక్కన—కాలస్వరూపిణియై శక్తి చేస్తుంది.

దోహర్త—భగవంతుడు లేకుండానా?

తిక్కన—భగవంతుడు ద్రష్టగా వుంటాడు. చూస్తూవుంటే సృష్టి అయిపోతూవుంటుంది.

దోహర్త—ఆయన చూస్తూవుండకపోతేనో?

తిక్కన—బండి ఆగుతుంది.

దోహర్త—మీరు రోజూ మామిడిచెట్టువంక చూస్తున్నారు. అది పెరుగుతున్నది. పరబ్రహ్మముకూడా చూస్తూవున్నాడు. అది పెరుగుతున్నది. రెండుచూపులూ ఒకటేనా?

తిక్కన—నాది వట్టిచూపు.

దోహర్త—మీరు కండ్లుపెట్టుకొని చూచినా అది పెరగడం లేదు. పరబ్రహ్మ కండ్లులేకుండా చూచినా అది పెరుగుతున్నది.

తిక్కన—ఆయనవిషయములో చూస్తున్నాడనే ధాతువుకు చేస్తున్నాడనే అర్థము.

దోహర్త—చేస్తున్నాడని అనకుండా ద్రష్ట అని ఇంకొక మాట ఉపయోగించినంతమాత్రంచేత చేయనట్లు అర్థం కాదు. నా ఉద్దేశములో గౌడపాదుని అజాతవాదానికి కాళ్లు లేవు. ఒక వస్తువును చేయడమంటే రోట్లో వేసి దంచిచేస్తేనే చేయడంగాదు. ఎట్లా చేసినా చేసినట్లే. ద్రష్టగా వుండి చేయడం చేసేవిధములలో భేదం.

తిక్కన—శక్తి చేస్తుంది.

దోహర్త—ఎవరి శక్తి?

తిక్కన—శక్తి కలవాడిది.

దోహర్త—ఆ శక్తు డెవరు? పరమాత్మ శక్తుడయితే శక్తి చేసిందన్నా, పరమాత్మచేశాడన్నా ఒకటే.

ఇటువంటి వాదములలోకి దిగితే దోహర్త తిక్కన విషయాలు మరచిపోతాడని తిక్కనకు తెలుసును. తానూ ఆదారినే కొంతసేపు పోయినాడు. అక్కడ తప్పుకొని తల్లివంక తిరిగి 'అమ్మా' అని పిలిచాడు.

అన్న—ఆహా లేమిరా? మీ నాన్నగారి మాటలు వింటూ వున్నట్లున్నది.

తిక్కన—ఈభావాలన్నీ వారివే. వారికి నూతనభావాలు స్థిరపడి వెల్లడించేటప్పటికి నేను నెల్లూరు వెళ్లిపోయినాను. బాగా ముమ్మరపురోజులలో వీ డాయనదగ్గర భాష్యశుద్ధి చేసుకున్నాడు. వీడు మొదటినుంచీకూడా తిక్కతర్కాలు చేస్తూనేవుండేవాడు. ఇప్పుడు పెద్ద సిద్ధాంతి అయినాడు. మమ్మును వాదములో నెల కట్టనీయడు.

అన్న—వాడిని ఆశీర్వదించు. మంచి ఉద్యోగముకూడ దొరికింది. దేవుడిచ్చిన ఆయువు తిన్నగా వుంటే వాడే ప్రథముడవుతాడు.

దోహర్త—చిన్నమ్మా! ఇదంతా నీచలవేనే.

అన్న—కానియ్యి నాయనా! నాకథ ముగిసిందిగదా. ఇక రోజులు లెక్కపెట్టుకుంటూ కాలంకోసం కనిపెట్టుకొనివుంటా.

దోహర్త—చిన్నమ్మా! నీవు పండిపోయినావే.

అన్న—ఇక ఎండి రాలుతాను.

తిక్కన విభ్రమపడి వింటున్నాడు. పండి, ఎండి, రాలడమనే మాటలు అనేకభావాలు తోపిస్తూ మనస్సును తొలుస్తున్నవి.

తిక్కన—అమ్మా! ఇవ్వాళ పదవ రోజు. జరుగవలసిన పనేమిటి?

అన్న—(కొంతసే పాలోచించి) మీరిద్దరూకూడ ఇక్కడే వున్నారు. నాకు మీ నాన్నగారు పోయినా రనే భావమే లేదు. సహగమనము చేయవలె నని అప్పుడు తోచిందిగాని అంత తీవ్రత ఇప్పుడు లేదు. భగవానుని అర్ధనారీశ్వరత్వం తరుచుగా స్ఫురిస్తున్నది. భార్యాభర్తలు రెండు వ్యక్తులు గారు. మానవునియొక్క కుడిభాగము పాదరసపదార్థము; ఎడమభాగము గంధకద్రవ్యము. పురుషస్త్రీసమ్మేళనములో ఏద్రవ్యము బలవత్తరమో ఆరూపము సువ్యక్తమవుతుంది. ఏకశక్తి ముఖద్వయములో జన్మించి మార్గద్వయమున ఆత్మోపలబ్ధిని బొంది పూర్ణత్వమును బెందుతుంది. వీటికి పూర్తిగా ఎడబాటు లేదు. ఉభయములును స్థూలశరీరములలోనే ఉండవలసిన అవసరము లేదు. ఆరూపముయొక్క భాగమే నేను. నే నెల్లప్పుడును సువాసినినే. వైధవ్యమే లేదు నాకు.

తిక్కన—నా కందరేదే తల్లీ నీ వున్నతభావాలు!

అన్న—పురుషునికీ, ప్రకృతికీ సత్యత్వములో భేదా వుండవచ్చునుగాని నిత్యత్వములో లేదుగదా.

తిక్కన—అవును.

అన్న—సదసత్తులకు ఎడబాటు ఎక్కడ వున్నది?

దోహర్త—సాంఖ్యదృష్టిలో చూచినా లేదు. వేదాంత దృష్టితో చూచినా లేదు.

తిక్కన—అంతవరకు అవగాహన అయింది.

అన్న—ప్రకృతికి అనాదత్వ మెప్పటికీ లేదు. ఈ జంట అరూపస్థితినుంచి సరూపస్థితిని పొందుతుంది.

దోహర్త—అద్భుతమయిన రూపమును తాలుస్తుంది.

అన్న—అద్భుతమే. లోపలనున్నదే వ్యక్తమయింది. మరి యొకచోటినుంచి రాదు.

తిక్కన—అది లీలగదా.

అన్న—లీలలో ఆనంద ముండదా?

తిక్కన—ఎవరికి ఆనందం?

అన్న—ఎవరికి లీలో వారికే ఆనందం.

అన్నయమంత్రి—(గదివాకిట్లోనుండి)

"నేను అన్నయ్యను. అమ్మగారి శెలవయితే వారి దర్శనం కొరకు లోపలకు రావలెనని బయట నిలుచున్నాను. మీ యందటి సంభాషణను విన్నాను. ఇక ఆగలేను. శెలవిప్పించండి : లోపలికి వస్తాను. నా అమ్మదగ్గరకు నేనమాత్ర మెందుకు రాకూడదు?"

తిక్కన తల్లివంక చూచాడు. ఆమెకు ఆక్షేపణ లేనట్లు తోచింది.

తిక్కన—అయ్యా! తమరు రావడాని కేమాక్షేపణున్నది? దయచేయండి లోపలికి.

అన్నయ్య—ధన్యోస్మి.

అని లోపలికి వచ్చి ఉత్తరీయము నడుముకు జుట్టుకొని అన్నమాంబకు సాష్టాంగనమస్కారము చేసి చెంపలు వేసుకొని కూర్చున్నాడు.

తిక్కన—ఇంతవరకు సంభాషణంతా విన్నారుగనుక ఇక్కడనుంచే సాగింతాం.

అన్నయ్య—లీల ఎవరిదో ఆనందమూ వారికేనని దోహర్తగారన్నారు.

అన్న—కనిపెంచిన తలిదండ్రుల కానంద ముండదా?

దోహర్త—వుంటుంది. పిల్లలు చస్తే వుండదు.

అన్న—ఒరే నారాయణా!...ఇప్పుడు దోహర్తవు గావూలె. బాణాలు రెండుచేతులా విసిరి దోహర్తబిరుదు సంపాదించావు. వాదములోగూడా అంతే నీవు. అయినా నేను మొదటిపేరుతోనే పిలుస్తాను.

సృష్టిలో చావులేదు. లయము లేనేలేదు. ఈ విశ్వమాతాపితలు అంత తెలివితక్కువవాండ్లూ, చేతగానివాండ్లూ కారు. అట్టి తెలివి తక్కువ పని చేయరు. సంపూర్ణదృష్టి లేక సృష్టిస్థితిలయము లని అనుకుంటాము. ఏమనుకున్నా గమ్యస్థానమువంక నడుస్తూనే వుంటాము. మన అభిప్రాయాలనుబట్టి సృష్టిక్రమము మారదు. గమ్యస్థానము వంక నడుస్తూనే వుంటాము మెల్లమెల్లగను.

దోహర్త—దీనివలన విశ్వపితలకు అనుభవ ముండదా?

అన్న—ఉంటుంది. ఆనందానుభవము. నీకే అంటివిగా!

తిక్కన—సృష్టిలేకుండా వారి కనుభవము రాదా!

అన్న—ఈ అనుభవము రాదు. అనుభవములేకుండా ఏ అనుభవమూ రాదు. అది అసంభవము. స్వవచనవ్యాఘాతము.

తిక్కన—నిష్కామకర్మ అయితేనో?

దోహర్త—నిష్కామకర్మ విషయములో కోరికలేదన్నారు గాని అందువల్ల అనుభవము లేదనలేదు.

అన్న—చాలా శాఖాచంక్రమణ మయింది. అసలు విషయానికి వత్తాము. నలుగురూ ఏమయినా అనుకుంటారేమో నని లోకాచారము జరుపుకుంటే జరుపుకోవచ్చును.

దోహర్త—వపనము కర్మకాండలో భాగము కాదు. పూరి బయటికి పోయి మంగలికి తలయియ్యడం అసహ్యం.

తిక్కన—శ్రీమద్రామానుజులు వపనము చేయించుకొన్న స్త్రీని చూస్తే సచేలస్నానము చేయవలసిం దన్నారు.

అన్నయ్య—బసవేశ్వరులు కూడ అంగీకరించలేదు.

అన్న—ఊరి బయటికి పోకుండా యిక్కడే జరుపుకోవచ్చు. విశేషచర్చ లేకుండా కానియ్యండి. నాభావములో నేను నిత్యసువాసినినే.

ముగ్గురూ బయటికి వస్తారు!

తల్లితో మాట్లాడి యివతలకు వచ్చినతరువాత ఆమె వ్యక్త పరచిన పురుషప్రకృతుల నిత్యదాంపత్య లీలాసిద్ధాంతము తన మనోనేత్రమునకు మఱుగుపడియున్న ఒక నూతన విజ్ఞానప్రపంచమునకు కవాటము బార్లా తెరచి ప్రదర్శించిన ట్లయింది. ఆ ప్రపంచానికి ఎటుజూచినా అంతు కనపడలేదు. "పాదోస్య విశ్వా భూతాని, త్రిపాదస్యామృతం దివి" అని పురుషసూక్తములో చెప్పినట్లు మూడుభాగములు యథాప్రకారముగా నుండి నాలుగవ భాగము మాత్రము ఈ సమస్తము నైనది. "ఏతావా నస్య మహిమా"—ఇది ఆయన మహిమట. అని తనలో తాను పైకి వినబడేటట్లు అనుకుంటూ వస్తున్నాడు తిక్కన.

దోహర్త—ఏమిటన్నయ్యా యోచిస్తున్నావు? చిన్నమ్మ చెప్పినదానిమీదనేనా యీ ఆలోచన?

అన్నయ్య—సృష్టి యావత్తూ పరమాత్మనియొక్క వ్యక్త అర్ధనారీశ్వరరూపమేనని వ్యక్తపరచారు రామె.

దోహర్త—ఇది అంతయూ ఆయనయొక్క మహిమ అని ఎందుకన్నారు?

అన్నమాంబ—ఒరే నారాయణా! ఆ మాటలు ఇక్కడే మాట్లాడుకోరాదా? నేను కూడా వింటాను.

అన్నయ్య—అవును. వారి దగ్గరే మాట్లాడితే వారి అభిప్రాయంకూడా కలిసివస్తుంది.

ముగ్గురూ వరల లోపలికి పోయి కూర్చున్నారు.

అన్నయ్య—దోహత్త ప్రశ్న కేమి జవాబు?

తిక్కన—ఏ హద్దులకూ లోబడనట్టియు, అమృతస్వరూపియు నగు సద్వస్తువు ఇరుకులలో ఒదిగి కాలబద్ధమై జరామరణములకు లోనైయుండుటయే. పరమాత్ముడు చేసిన మహాత్యాగము. అందుచేతనే మానవుడు త్యాగముచేయక జీవింపగూడదని ఈశోపనిషత్తు చెప్పుచున్నది. త్యాగమువల్లనే అమృతత్వము పొందుదురని "త్యాగేనైకేన" అను శ్రుతివల్ల ప్రకటితమవుతున్నది. ఈత్యాగమే ఆయనమహిమ. మానవుడు దాని ననుకరించవలెను.

దోహత్త—ఒకప్పుడు లోభిగావుండి త్యాగి అయినాడని అర్థమా?

తిక్కన—ఆయన ఎప్పుడూ త్యాగే.

దోహత్త—పరమాత్మునకు సగుణనిర్గుణాలు రెండూ స్వభావధర్మములే అన్నమాట.

అన్నయ్య—ఒక వస్తువు సగుణమూ, నిర్గుణమూగాగూడా ఎట్లావుంటుంది? ఏదో ఒకటే సాధ్యమవుతుంది.

తిక్కన—అందువల్లనే పరబ్రహ్మము ఎప్పుడూ నిర్గుణుడే అన్నారు.

దోహత్త—అంటే పరబ్రహ్మము ఈ విశ్వమంతా కావడము గాని, సృష్టించడముగాని లేదన్నమాట. సృష్టిస్తున్నాడని అనేక శ్రుతులు చెప్పుతున్నవే?

తిక్కన—అవునంటే పరబ్రహ్మ మార్పుచెందినట్లు అంగీకరించవలసి వస్తుంది. అందుకని మార్పుచెందినట్లు కనపడును గాని నిజముగా మార్పుచెంద డన్నారు.

దోహత్త—ఎవరిని మోసగించడానికి ఈ కనపడడము? సత్యమేదో అదే కనపరచరాదా?

తిక్కన—ఆయన సత్యమునే కనుపరుస్తున్నాడు. మనమే భ్రమపడుతున్నాము.

దోహత్త—లేనిని వున్నట్లు కనుపడి మనలను భ్రమపెడుతున్నాడు.

తిక్కన—ఆయన చేయనట్లే కనుపడుతున్నాడు. మనమే భ్రమపడుతున్నాము.

దోహత్త—శ్రుతులు పరబ్రహ్మము చేస్తున్నాడనిగాని, అవుతున్నాడనిగాని చెప్పకపోతే మన మీదేవుకి గొడవ లేకుండా హాయిగా వుందుముగా. అదిగాక మన నీభ్రమలో ఎందుకు సృష్టించవలె?

తిక్కన—మీరే అయినారు ఈభ్రమతో.

దోహత్త—అయితే నేను ఇదంతా అయినానని సృష్టిస్థితిలయములు నావల్లనే అవుతున్నవని బడాయికోసము ఒకవిధంగా చెప్పారూ తను మారినానని అనుకుంటారని భయపడి తానేమియు తెలుగనని మఱియొకచోట చెపితే అదే మోసమని నేనంటాను. నిజమేదో అదే చెప్పమంటాను. ఆదేవుడూ, ఆయనశ్రుతులూనూ.

అన్నమాంబ—సృష్టిలోనూ, శ్రుతులలోనూ వ్యక్తమవుతున్న యీ అద్వైతభావము భగవంతుని మోసమువల్లనని ఒకరి వాదమువల్లనూ, జీవునియొక్క బుద్ధిలేనితనమువల్లనని మఱియొకరి వాదమువల్లనూ తేటపడుతున్నది. ఈ వాదములలో ఏది సత్యమనుకున్నా వేదాంతముయొక్క బుద్ధిలేనితనము ఋజువవుతుంది. ఇప్పటికీవాదము చాలించండి.

దోహత్త—భగవంతుడు వాస్తవమునకు భిన్నముగా కనుపడుతున్నాడని ఆయన అన్నాడుగనుక అది మోసమని నే నన్నానుగాని అది నా విశ్వాసము గాదు.

అన్నమాంబ—విశ్వాసములేని వాదన చేయవద్దు. మీవాదనే దారితోలింది. ఈవిషయము మఱియొకప్పుడు యోచింతాము. మొదట మీరు ప్రారంభించిన త్యాగముసంగతి మాట్లాడండి.

తిక్కన—ఏవిధమయిన హద్దులకూ లోబడని పరమాత్ముడు హద్దులలో నిముడుటయే త్యాగమనీ, ఈత్యాగమే ఆయనమహిమను వెల్లడించుననీ నా అభిప్రాయము.

దోహత్త—బయటిబలవంతము లేకుండా స్వేచ్ఛగా నొక కార్యముచేసినప్పుడు ఏప్రతిబంధకమూ వుండదు. వ్యక్తముకావడం పరమేశ్వరుని స్వభావము.

తిక్కన—త్యాగమనగా అదే. కష్టములో చేయు త్యాగమునకు విలువ తక్కువ. సృష్టి నిర్హేతుకముగ జరుగుచున్నది. ప్రేమచేత ప్రేరేపింపబడినచో సర్వోత్కృష్టమయినది. ఇట్టిప్రేమ తల్లిపిల్లలలోనూ, నాయకీనాయకులలోనూ, స్నేహితులలోనూ సృష్టియందు వ్యక్తమౌతున్నది.

దోహత్త—అందువల్లనే జ్ఞానస్వరూపుడైన భగవానునికంటె ప్రేమాన్వితుడయిన భగవంతునే నే గోరుకొందును. 'ప్రజ్ఞానం బ్రహ్మ' యను మహావాక్యమునకంటె 'రసోవై సః' అను మహావాక్యమే నన్ను వివశుణ్ణి చేస్తుంది. ఈభావమునే యొక మహాత్ముడు—

"ఉపాసతా మాత్మవిదః పురాణాః
పరం పుమాంసం నిహితం గుహాయాం,
వయం యశోదాశిశుబాలలీలా
కథాసుధాసింధుషు లీలయామః"

అని అన్నాడు.

"పితేవ పుత్రస్య సఖేవ సఖ్యుః
ప్రియః ప్రియాయార్హసి దేవ సోఢుం"

అని గీత చెప్పుతున్నది.

"ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్" అని శ్రుతి కడపటి వాక్యము జెప్పినది.

అన్నమాంబ—భగవానుడు శక్తిస్వరూపుడు. ఇచ్ఛాశక్తి, మంత్రశక్తి, ఉత్సాహశక్తి యని శక్తి మూడువిధములు. మన మింత

వరకు మంత్రఉత్సాహశక్తులనుగూర్చి యోచించినాము. ఇచ్ఛాశక్తి ఈశ్వరుని మూలశక్తి. ప్రజ్ఞారసశక్తులు సత్తుపై సుప్రతిష్ఠితములై యున్నవి. నిరంతరమును సృష్టిస్థితిలయములను గావించునదియే సంకల్పశక్తి. 'ఏకం సత్' అను మహావాక్యము అతని నిజస్వరూపమును దెలుపుచున్నది. పరబ్రహ్మ అచలము గాదు. అది నిత్యచలనము. ఉనికిమనుకులు అతని స్వభావములు.

దోహర్త—భగవంతుని ఉండుటలో అనుటకూడ ఇమిడి యున్నది. భగవంతునియొక్క యీసృష్టిప్రేరణశక్తియే జంతువులను వివిధకార్యములకు పురికొల్పుచున్నది. వృక్షములలోని కదలికయును, నదుల ప్రవాహశక్తియు, సూదంటురాతి ఆకర్షణశక్తియు భగవానుని సంకల్పశక్తియొక్క వికాసములే.

అన్నమాంబ—దానికి బృహదారణ్యకోపనిషత్తు చెప్పింది కూడ కలపండి. పరబ్రహ్మకు ఒంటరిగా వుంటే తోచదుట. రెండుగా వుంటాడట. విశ్వమంతా పతిపత్నీరూపం దాల్చింది. అర్ధనారీశ్వర పాత్రను ధరించి విశ్వమంతా నాట్యరంగం చేసి నటకావతంసబిరుదమును సంపాదించాడు పరబ్రహ్మ. విష్ణువై లోకమంతా రసమండలము చేసి రాధామాయితో వేణుగానం చేస్తూ నిత్యలీల సల్పుతున్నాడు. బ్రహ్మయై శారదాముఖమున చామష్టికళల సంయోగముచే సృష్టికావ్యమును విరచించి మహాకవి యనిపించుకున్నాడు. నదుల వేగమున, అయస్కాంతముల ఆకర్షణయున, అణువుల రసాయనికసమ్మేళనమున ఆ వేగము ప్రకటితమౌతున్నది. తరుగుల్మలతాదులలో దాంపత్యధర్మము సుస్పష్టమౌతున్నది. చిగురుతోంపముల లేతదనమున, విరిగుత్తుల కమ్మతావులయందు, ఆమనివిలసనమున రసములు చిప్పిలుతున్నవి. తాళదంపతుల విప్రలంభము, పొట్లదంపతుల ప్రణయకలహము, చిక్కుడుదంపతుల సంయోగము, లతాభిసారికల గాలిబోజుంగులతోడి సైకూటలు విశ్వజననీజనకుల విలాసములను వ్యక్తపరుస్తున్నవి. శుకపికశారికల వేణుగానసరళులు, శరభసింహశార్దూలముల ఘోరవియోగకల్లోలములు జగత్పితల కామసూత్రములపై కారికలు. బ్రహ్మచర్య, గార్హస్థ్య, వానప్రస్థ, సన్యాసములు విశ్వదంపతుల కొక్కోకమునకు వ్యాఖ్యానములు. పథ్యమును, లంఖణమును క్షుధాభోగములకు దారితీయునుగాని వానిని నశింపజేయనట్లు వానప్రస్థసన్యాసములు దాంపత్యవిరమణమునకుగాక విరమణమునకే తోడ్పడును. వియోగము సంయోగాసక్తిని తీవ్రపరచును. ఆశ్రమధర్మములు దాంపత్యధర్మముయొక్క అవస్థలు.

ఇది సృష్టిరహస్యము. భగవానుడు అణువై, వృక్షమై, జంతువై, మానవుడై విరాడ్రూపమున అన్నమయ, ప్రాణమయ, విజ్ఞానమయ, ఆనందమయకోశముల నలంకరించుకొని ఆత్మోపలబ్ధిని బొందుచున్నాడు. బీజరూపమున అతని యునికిలో నున్న శక్తులన్నియు మనికిలో విస్తరిల్లుతున్నవి. ఇదియే విరాడ్రూపమున మొలచి, పెరిగి, పూచి, కాచి, పండిన అశ్వత్థము. బృంహతీతి బ్రహ్మ—అనంతముగ పెరిగిపోతున్నాడు. ఆకాశమున నిమిషమునకు లక్షల యోజనములవంతున విస్తరించుచు స్ఫాలనమున అన్ని వైపుల నాక్రమించుచున్నది. ఇదియంతయు భగవానుని ఏకపాద్విభూతి యన్నారుగాని యది పాతమాట. ఇప్పటికి బహుపాద్విభూతి యైయుంటుంది. ఉనికి పూర్ణమయినచో మనికి అపూర్ణము గాదు. భగవానుని ఉనికిమనుకులు రెండూ ఒకటే. వట్టి ఉనికికంటె మనికే మేలయినది. భగవానుని మనికి నిత్యము, సత్యముగూడాను.

ఇందులో మానవుని భాగము అతిస్వల్పము. మన మణువులము, కాని యీ మహాయంత్రములోని ప్రతియణువునుగూడ భగవానునితోపాటు ఆత్మోపలబ్ధిని బొందుచున్నది. విశ్వకళ్యాణము మనకును కళ్యాణమే. ఇది భగవానుని త్యాగమా? ఆయనపప్పు ఏమి చిమిడింది! ఇది స్వామికి నిత్యభోగము. నేను నా నాథునితో జేరి పరమాత్మునితోపాటు నిత్యమును సహభోజనము గావింతును. మాకు వియోగము లేదు. నేను నిత్యసుమంగళిని.

అన్నయ్య—తల్లీ! మాకు విశ్వదాంపత్యోపనిషత్తును వినిపించితివి.

అన్న—తోచినది చెప్పితిని. ప్రస్తుతావస్థవలని ఒరిపిడిలో ఇది నాకు సువ్యక్తమయినది.

అన్నయ్య—తల్లీ!

తిక్కన నిస్తబ్ధుడై కూర్చున్నాడు.

దోహర్త—చిన్నమ్మా! ఎవరో అనుకుంటారని యీ పదవరోజుతంతు జరపడం నా కేమాత్రం ఇష్టంలేదు.

అన్న—మీయిష్టము.

తిక్కన—అవసరము లేదనుకుంటాను.

అన్నయ్య—నా అభిప్రాయమూ అదే.

తిక్కన—అన్యాయము. రాత్రి నేనూ, చిన్నవాడు, రాజుగారు మాట్లాడడములో సారంగపాణివల్ల రావలసిన రెండులక్షల రూప్యములను విద్యకై వినియోగించవలసినదని నిశ్చయించుకున్నాము. గుంటూరిలో నాన్నగారిపేర ఆయుర్వేద, ధనుర్వేద కళాశాలలు స్థాపించవలయునని తలంచితిమి. ఇకమీద మన కీవూరిలో పనిలేదు. గనుక మన భవనములను కళాశాలల కిచ్చివేసిన బాగుండునని తోస్తుంది. నీ అభిప్రాయ మేమి?

అన్నమాంబ—నా కిక్క డేమిపని? ఇచ్చివేయవచ్చును.

అన్నయ్య—చాల ఉత్తమమయిన ఏర్పాటు.

దోహర్త—ఈ ఏర్పాటు చిన్నాన్న జీవితాదర్శములకు అనుగుణ్యంగా వున్నది.

తిక్కన—సరే, పొద్దెక్కింది, ధర్మోదకాల పని చాలాసేపు పడుతుందిగూడాను. లేవండి.

అంతా లేచారు.